# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారం పునరుద్దరణకు 11 వేల 440 కోట్ల రూపాయలు ప్యాకేజీకి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**2.** **విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీ ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.**

**3.** **సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఉచితంగా నివాసస్థలాన్ని కేటాయిస్తామని సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

===========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారం పునరుద్దరణకు 11 వేల 440 కోట్ల రూపాయల ప్యాకేజీకి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.. ఈ మేరకు ఆయన ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... గురువారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో పునరుద్దరణ ప్యాకేజీకి ఆమోదం లభించిందని చెప్పారు. దేశంలోని ఉక్కు రంగంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఒక ముఖ్యమైన సంస్థ అని అన్నారు. ఈ ప్యాకేజీ సహాయంతో ఆ సంస్థ ఉద్యోగులకు, వాటాదారులకు ప్రయోజన చేకూరనుందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

వాయిస్.. 36 సెకన్లు

ఇది ఇలా ఉండగా విశాఖ పట్నం ఉక్కు కర్మాగారానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం ఉందని, కనుక ఈ సంస్థకు ఆర్థిక సహాయం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ నిర్మాణంలో ఉక్కు రంగానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని ప్రధాన మంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు.

-------------------------

విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీ ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు నాయుడు నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని కాపాడాతామని ప్రజలకు హామీ ఇచ్చామని, 7 నెలలుగా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించాయని పేర్కొంటూ..

వాయిస్...38 సెకన్లు

---------------------------

మరోవైపు విశాఖ పట్నం ఉక్కు కర్మాగారానికి ఆర్థిక సహాయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కల్యాణ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో విశాఖ పట్నం ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం వస్తుందని అన్నారు.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవ వల్లనే ఇది సాధ్యమైందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యల పరిష్కారానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు.

---------------------------

సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్- ఐటీఈతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. సింగపూర్‌లో పర్యటిస్తున్న ఆయన ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం నిన్న ఐటీఈ క్యాంపస్‌ను సందర్శించి ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగ సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు ఈ ఒప్పందం దోహదపడనుందని అన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి గ్రామీణ ప్రాంతాల్లో 3, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఉచితంగా నివాసస్థలాన్ని కేటాయిస్తామని సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం నిన్న సమావేశమై పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ (32 సెకన్లు)

అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు 700 కోట్ల రూపాయల రుణాలు పొందడానికి మార్క్ ఫెడ్ కు అనుమతి, గుంటూరు జిల్లా తాడేపల్లి వైపు 294 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం, 62 నియోజకవర్గాల్లో అన్నక్యాంటీన్ లను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్-2 ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్ష ప్రాథమిక కీ ని ఈరోజు విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈరోజు నుంచి ఈనెల 22వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి ప్రాథమిక కీ

అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపింది. రాష్ట్రంలో 783 గ్రూప్–2 పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 1368 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి.

---------------------------

తెలంగాణలో పాత రేషన్ కార్డులను తొలగించడం లేదని, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి కార్డులు జారీ చేయనున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తిలో మంత్రి నిన్న పాత్రికేయులతో సమావేశంలో మాట్లాడారు... ఈ నెల 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాలలో సర్వే జరుగుతుందని ఆయన పేర్కొంటూ

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

తిరుమల శ్రీ వెంటేశ్వర స్వామి వారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన టికెట్లకు ఏప్రిల్ నెల కోటాను ఈ ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవల లక్కీ డిప్ కోసం ఈనెల 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపింది. 23 వ తేదీన ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్ల కోటా, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా, మధ్యాహ్నం మూడు గంటలకు వృద్ధులు,దివ్యాంగుల ఉచిత దర్శన కోటా విడుదల చేయనుంది. అలాగే 24న ఉదయం 10 గంటలకు 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా, అద్దె గదుల బుకింగ్ కోటా మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల చేస్తామని తెలిపింది.

---------------------------

ఖమ్మంలో 546 ఎకరాల్లో పెద్ద ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను మంత్రి నిన్న సందర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి లో అర్బన్ పార్క్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చిరుధాన్యాల దుకాణాలతో పాటు సైక్లింగ్, స్విమ్మింగ్, బోటింగ్ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

=====================